

# అంటుమామిడి

రాజయ్యబావ చాలా ఆకస్మికంగా చనిపోయినప్పటికీ అతని తుది కోరిక ఏమిటో అతని సన్నిహితు లందరూ గ్రహించగలరు.

పదోరోజున "అంటుమామిడి చెట్టును పెరటిగుమ్మంలో పాతిస్తాను," అని రాజయ్య బావమరది వెంకటచలం పలికిన తరువాతనే కాకులు పిండాన్ని ముట్టుకున్నాయి.

ఇంట్లో చావుసందడి అంతా తగ్గాక వెంకటచలం అనుకున్నాడు, "అంటు మామిడిచెట్టును పాతించకపోతే ఏం?" అని. అత నిలా అనుకోవటం ఎవరికీ తెలీదు. పక్షం రోజులు గడిచినా పెరటి గుమ్మంలో అంటుమామిడిమొక్క తల గాలికి అల్లల్లాట్టంలేదేమని ఊళ్లోవాళ్లంతా పరామర్శించుకుంటున్నారు.

వెంకటచలం తన రాజయ్యబావమీద వేరే వింత అభిప్రాయంతో ఉన్నాడు. రాజయ్య బాల్యంనుంచీ భాగ్యవంతుడు. వెంకటాచలం బాల్యంలోనే భాగ్యవంతుడు.

పేదస్థితికివచ్చినదగ్గర్నుంచీ వెంకటాచలం తండ్రి సుబ్బయ్యగారు అల్లుని సహాయాన్ని ఎన్నోసార్లు కోరాడు. కోరిన వేళావిశేషాన్నిబట్టి రాజయ్య తనమామకు చేయూతను అందిచ్చేవాడు. ఆసహాయం వేళ్లమీద లెక్కపెట్టగలిగినన్ని సార్లే.

రాజయ్య విచిత్రవ్యక్తి అని ఊళ్లో వాళ్ళంతా అనుకున్నప్పటికీ, రాజయ్యపై వెంకటాచలానికీ సుబ్బయ్యగారికీ వేరే అభిప్రాయం ఉండేది.

సుబ్బయ్యతల్లి రాజయ్యకు అమ్మమ్మ. ఆమె మరణించినప్పుడు పెద్దదనానికి నూరురూపాయలివ్వమని మామయ్య అల్లుణ్ణి కోరాడు. మామచేత పెరట్లోని చిన్నినేలను వ్రాయించుకుని మరీ ఇచ్చాడు పచ్చకాగితం రాజయ్య.

నాటినుంచీ పెరట్లోని చిన్న భూభాగానికి రాజయ్య యజమాని అయాడు. పెరట్లోఅంటుమామిడిమొక్కను వేశాడు రాజయ్య. మూడేళ్ళకు పిందెలు వేసింది. దిష్టితగలకుండా రాజయ్య గుడ్డబొమ్మను కట్టా డాచెట్టుకి. రెండేళ్ళు గడిచినవి.

మధుమూర్తి

పల్లెలోని తోటలన్నీ పెద్దగాలికి పాడై పోయాయి కాని, రాజయ్యబావ అంటు మామిడిచెట్టు పిందెకూడా కిందపడలేదు

పల్లెలోనివాళ్లంతా రాజయ్యని అడిగారు. ఇంటికి పాతికకాయచొప్పున పంచి ఇస్తే ఊరగాయ పెట్టుకుంటామని —

"మీ అమ్మ పేరు, అమ్మమ్మ పేరు చెప్పుకుని ఊరగాయ తింటాం" అని మరికొందరు అతన్ని పొగిడారు.

"సంతవెల యిస్తాం కావలిస్తే...ఊరగాయలకు లేకుండా తోటలు ధ్వంసం అయాయి" అని మరికొంత మంది అహంతో అడిగారు.

కాని, రాజయ్య గుండె కరగలేదు. "నన్ను అట్టే మొహమాట పెట్టకండి" అన్నాడు రాజయ్య.

అవి యింకా నిర్మాణ కార్యక్రమ ప్రభావంరోజులు కాబట్టి రాజయ్య ఇంటికి అంటుమామిడిచెట్టు పంటఅంతా ప్రశాంతంగా ఎగుమతి అయింది.

తట్టలతో మామిడికాయలను కూలీలు తీసుకుపోతూంటే ఊళ్లోని ఆడవాళ్లంతా అనుకున్నారు "జగ్గమ్మే పంచిపెడుతుందిలే ఊరగాయని" అని.

జగ్గమ్మకి దానం అనే సీరసగుణం లేకపోలేదు. అదితండ్రినుంచితుంచుకున్న గుణం. అయితే ఆమె దాతృత్వం చెలాయించడానికి రాజయ్యయిల్లే ఆమెకు పరాయికొంప అయింది. పెళ్ళి అవక ముందు,అయింతరవాతకూడా ఆడపిల్లకి పుట్టిల్లూ, మెట్టేయిల్లూ పరాయికొంప లవటంఅనుశ్రుతంగా వచ్చే అయోగ్యత.

రాజయ్యకు డబ్బుగలవాడిననే గర్వం ఎక్కువే. కాని, అవూరికరణం తనకన్న ధనికుడుకదా అనిఅతనిఆత్మ వెక్కిరించినప్పుడు "అ... ఫరవాలేదు ... అత్తమామలకంటె అధిక ధనవంతుణ్ణికదా" అని జవాబిచ్చుకుని సంతృప్తిపడేవాడు. అత్తమామలకంటె ప్రతి కష్టజీవి మేలు అనే సంగతి అతనుఆలోచించేవాడుకాదు.

సుబ్బరాయడుషష్టికి జగ్గమ్మ సోదరుల్ని భోజనానికి పిలిచింది. బ్రహ్మచారులు మనింటికి వచ్చారు. ఏదో నూలుపోగు వాళ్ళొంటిని వెయ్యండి" అని జగ్గమ్మ భర్తను ప్రాధేయపడింది.

సాలెసుబ్బన్న మగ్గం మీదనుంచి తాజాగా దిగిన అంగవస్త్రాలతో బ్రహ్మచారులను పూజించి ఒళ్ళువిరుచుకున్నాడు పెళ్లాం యెదుట రాజయ్య.

వెంకటాచలం ఈ సంగతి మరచిపోలేదు. బావగారు తనబాల్యంలో చేసిన ఈ అసమానపు మర్యాదకు వెంకటాచలం విసుక్కున్నాడు. అక్కయింటికి వెళ్లటం మానేశాడు. అత్తింటికీపుట్టినింటికీ దూరం ఆరు ఫర్లాంగులే అవటంవల్ల జగ్గమ్మకి సంబరంగానే ఉంటూఉండేది. వెంకటాచలం మనసులో పెంచుకున్న విరోధం పల్లెలో ప్రాకకపోవటానికి ఈ సామీప్యమే కారణం అయింది.

సుబ్బయ్యగారు అల్లుని శపిస్తూనేచని పోయాడు. రాజయ్య ఈ శాపాలకి వెను

వెంటనే చావలేదు. జగ్గమ్మ తన తండ్రి పోయిన దుఃఖంతో రెండు నెలలపాటు పుట్టినింట్లోనే ఉండవలసి వచ్చింది. ఊళ్ళోనివాళ్ళు, పొరుగూరు వాళ్ళంతా కష్టంవచ్చినవాళ్లని పూర్తిగాపరామర్శించ టానికి రెండునెలలు గడువు కావాలి.

రెండునెలలపాటు రాజయ్యకి తాత్కాలికంగా భార్య అడ్డులేదు. కన్నతండ్రి పోయినందువల్ల జగ్గమ్మని వూళ్లోని అమ్మలక్కలు వూరగాయ అడగటానికి వీలులేకపోయింది.

ఎంకి ఆవూళ్లో కథానాయకురాలు. ఆవూళ్ళోని ధనికులకు ఆమె ఒక జలగ పేదవారిని ఆమె అందంలోని అయస్కాంతం బాధపెట్టినప్పుడల్లా వారిని ఆమె జలగలాగే సత్కరిస్తుంది. ఎంకికి తరగతుల తారతమ్యంతో నిమిత్తంలేదు ఉంటే పొట్టగడిచే ఉపాయం లేదని ఆమెకు తెలుసు.

ఎంకికి నగం కుండలోని అవకాయ నిచ్చి రాజయ్య సత్కరించాడు. రాజయ్య పాతేరు యీ విషయాన్ని వూళ్ళో పొక్కించాడు.

ఆ వ కా య తస్కరించినందుకు జగ్గమ్మకి కోపంరాలేదు కాని, ఎంకికంటె తనకిగల అర్ధాంగి హక్కును నిలుపుకో లేకపోయానని విచారించింది.

అవకాయను ఎంకికి యిచ్చినందుకు గ్రామస్థులు అవమానంగా భావించి ఆగ్రహించారు. తమకు చవిక్కైనా వూరగాయ దక్కనందుకు ఉడుకుమోతుతనం పెంచుకుని గ్రామస్థులు దానిని ఆగ్రహంగా ప్రకటించుకున్నారు. రాజయ్యకి ఈ గ్రామస్థులెవరైనా ఎంకి చేసేటంతటి సేవ చేశారా అని రాజయ్య ఆత్మ ప్రశ్నించుకుని ఆనందించింది.

ఏడాది ఇట్టే తిరిగింది. మళ్ళీ గాలి వాన వచ్చింది. ఊళ్ళోని తోటలు మళ్ళీ మాడిపోయాయి. రాజయ్యబావ అంటు మామిడికి రవంత నష్టమైనా కలుగలేదు. వూళ్ళోవాళ్లంతా మళ్ళీ రాజయ్యబావని అడిగారు కాయలిమ్మని. ఈసారి అతని నోటినుంచి "ఇస్తాను" అనే పలుకు వెలువడింది.

రాజయ్యబావ గ్రామస్థులకి మంచి వాడయ్యాడు. కాని అతనికి రాత్రుళ్ళు నిద్ర కరువైంది. అందరికీకాయలుపంచి పెట్టటం-అతనికి అలవాటులేనిదాతృత్వం -బాధపెట్టింది. కాని, యేంచేస్తాడు? మంచితనం చూపటంలో కూడా మహా ఇబ్బంది కనిపించిందతనికి.

"రేపు కాయలు దించుతా" అని రాజయ్య గ్రామస్థులకు చెప్పివెళ్ళినరాత్రే తిరిగి రెండోసారి గాలివాన వచ్చింది. తెల్లవారేసరికి చెట్టుకాయలు క్రిందపడలేదు. చెట్టే కూలింది.

గ్రామస్థులకు ఊరగాయ లేని బెంగ, రాజయ్యకు చేత్తో పెంచి పెద్దజేసిన చెట్టు కూలిపోయినబెంగ. బెంగతో అతను మంచం ఎక్కాడు. తిరిగి అతన్ని వెదురుకర్రల వాహనంమీదకే దించారు.